# తల్లి మనసు

వర్షపు జల్లుతో ఈదురు గాలి, తడక తలుపు తోసుకుంటూ లోపలికి వచ్చింది. తోసుకొచ్చిన తలుపును బలంగా మూశాడు చంద్రయ్య. ముసలి తల్లి ఓ మూలగా నిల్చుని కళ్ళు వత్తుకొంటోంది. ముత్యాలు లోపలి గదిలో కుంపటి మీద వేణ్ణీళ్ళు కాగపెడ్తోంది. మంచానికి బల్లిలా అతుక్కుపోయిన రెండేళ్ళ మల్లిగాడి చేతిని పట్టుకొని నాడి చూస్తున్నాడు డాక్టరు.

"నీళ్ళు కాగినట్లున్నాయండి. ఇంజక్షన్ యిస్తానన్నారుగా" అన్నాడు చంద్రయ్య, డాక్టరుతో.

రోగం బారి నుండి రోగి బయటపడితే అంతా తన ప్రజ్ఞే అంటాడు వైద్యుడు. కాకపోతే అంతా భగవంతుని లీల అంటూ వేదాంతం మాట్లాడుతాడు.

డాక్టరు చంద్రయ్యని జాలిగా చూస్తూ అన్నాడు, 'చంద్రయ్యా. నీ కొడుక్కి యింకే విధమైన మందులూ, ఇంజక్షన్లూ అవసరం లేకుండానే భగవంతుడు తీసుకుపోయాడు!'

దూరంగా ఎక్కడో పిడుగు పడింది. చంద్రయ్య తల్లి భోరుమంటూ మనవడి మీద పడి ఏడవసాగింది. చంద్రయ్య మంచం పక్కన కూలబడి గుండెలు బాదుకుంటూ ఏడవసాగాడు. కుంపటి దగ్గర్నించి లేచి ముందు గదిలోకి వస్తున్న ముత్యాలు, గుమ్మంలోనే చతికిలబడిపోయి అచేతనంగా ఉండిపోయింది.

డాక్టరు బాగ్ తీసుకొని తలుపు తోసుకొని, వర్షం కురుస్తున్నా లెఖ్ఖ చెయ్యకుండా పరుగెత్తి, ఎదురుగా కొద్ది దూరంలో మర్రి చెట్టు కింద ఆగిన రిక్షాలోకి పోయి కూర్చున్నాడు.

"నేను పోయి రిక్షా బాడుగ తెచ్చుకుంటానయ్యా" అన్నాడు, వర్షంలో తడుస్తున్న రిక్షావాడు.

"వాళ్ళనిప్పుడు - యిబ్బంది పెట్టకు. నేనిచ్చేస్తాన్లే, పోనియ్" అన్నాడు డాక్టరు.

"అంటే......." రిక్షావాడు అర్థోక్తిగా ఆగిపోయాడు.

"చంద్రయ్య కొడుకు చచ్చిపోయాడు" డాక్టరు సమాధానం విని, రిక్షావాడు మరి మాట్లాడకుండా, రిక్షా లాక్కొంటూ వెళ్ళిపోయాడు.

చంద్రయ్య యింట్లోంచి ఏడుపులు వినరావడంతో, చుట్టుపక్కల వాళ్ళు లోపలికి వెళ్ళి ఓదార్చసాగారు. చంద్రయ్య కన్నీళ్ళతో, మల్లిగాడికేసి చూస్తూ కూర్చుండిపోయాడు.

లేక లేక పుట్టిన కొడుకు! భగవంతుడు తన్నెందుకింత అన్యాయం చేయాలి? తనకు తెలుసున్నంత వరకూ, తను ఎవరికీ ఇంత హాని కూడా చేసి ఎరగడు. పధ్నాలుగో ఏట తండ్రి చనిపోవడంతో, చదువుతున్న తొమ్మిదో క్లాసుకి స్వస్తి చెప్పి, కాయకష్టం చేసుకొని, తల్లిని పోషిస్తూ వచ్చాడు. ఉన్నంతలో తిని, కూడబెట్టినంత కూడబెట్టాడు. రోజు కూలీతో మొదలుపెట్టి, పదిహేను సంవత్సరాల శ్రమ ఫలితంగా, ఊరి కామందు రామిరెడ్డి పొలంలో పాలేరుగా స్థిరపడ్డాడు. గంగరాజు కూతురు ముత్యాలు. అసలు చిన్నప్పట్నుంచీ ముత్యాలంటే తనకేదో అభిమానంగా ఉండేది. ముత్యాలు పెద్దమనిషయి, కొత్త అందాలు పుంజుకొన్న తర్వాత తన మనసు మనసులో లేకపోయింది.

పెద్ద కాలవలో కాలు జారిపడి మునిగి పోబోతున్న ముత్యాల్ని తను రక్షించాడు. తడి బట్టలతో తన్ను భయంగా, గట్టిగా కావిలించుకొన్న ముత్యాల్ని, తను అవసరమైన దానికన్నా గట్టిగానే అదుముకొన్నాడు. అది తప్పేనేమో? ఆ రోజు సాయంత్రమే, తల్లి ద్వారా కబురంపాడు. కండలు తిరిగిన శరీరంతో, కాయ కష్టం చేసుకొనే తనని, గంగరాజు తిరస్కరించ లేదు. ముత్యాలు మురిసిపోయింది. పెళ్ళి నాలుగు రోజులుందనగా, ఆ

పేట పోరంబోకు పోలయ్య, ముత్యాలు పమిట పట్టుకు లాగాడు. తనకి వళ్లు మండుకు పోయింది. చిన్నయ్య కొట్టు ముందు నలుగురూ చూస్తుండగా, వాణ్ణి చితక్కొట్టాడు. అది కూడా తప్పే ననుకొంటే, రెండోసారి తప్పు చేసినట్టు.

మనువయిన మర్నాడే ముత్యాల్ని కాపురానికి తీసుకొచ్చేశాడు. కూడబెట్టిన డబ్బుతో చేయించి ఉంచిన ముత్యాల దండని, తనువులు కలిసిన మొదటి రాత్రి ముత్యాలు మెడలో వేశాడు. "నాకోసం ఇంత పాటుపడ్డావు! నీ కోసం ఏం చెయ్యగలను?" అని అడిగింది ముత్యాలు. "ఏమీ చెయ్యక్కర్లేదు. బంగారంలాంటి కొడుకును కను" అన్నా డతను. ముత్యాలు కిసుక్కున నవ్వింది. ఆ నవ్వులో ముత్యాలు రాలాయి.

అయితే, మూడేళ్ళయినా ముత్యాలు కడుపున కాయ పడలేదు. తనంతగా పట్టించుకోక పోయినా, తల్లి సణుగుడు ప్రారంభించింది. పిల్లి మీదా, ఎలక మీదా పెట్టి నిందగా మాట్లాడ్డం మొదలుపెట్టినప్పుడు, గుడ్లలో నీళ్ళు కుక్కుకొని ఏడ్చేది ముత్యాలు. తన హృదయం కరిగిపోయేది. గుండెల్లో దాచుకొని ఓదార్చేవాడు. గిలిగింతలు పెట్టి, నవ్వేదాకా ఊరుకొనేవాడు కాదు. తర్వాత తర్వాత, కనబడ్డ రాయికల్లా మొక్కారు. ఊరి అమ్మవారికి పూజలు చేయించాడు. రాములవారి కోవెలలోకి స్వాములవారెవరో వస్తే ఇద్దరూ పోయి కాళ్ళ మీద పడ్డారు. ఇద్దరి నొసటా యింత విబూది పెట్టి, దీవించి పంపించేశాడు. ఆయన దీవెనలు ఫలించాయి! నెల తిరక్కుండానే ముత్యాలు నెల తప్పింది!

అంతవరకూ, సూటిపోటి మాటలంటున్న తల్లి, ముత్యాల్ని మరి కాలు కదపనియ్య లేదు. తనూ, తల్లీ ముత్యాల్ని పువ్వుల్లో పెట్టుకొని చూశారు. పట్నం తీసుకుపోయి పది మార్లు పెద్దాసుపత్రిలో చూపించాడు.

కెవ్వుమని పాకలోంచి కేక వినబడ్డప్పుడు తన గుండె లవిసిపోయాయి. సూరమ్మత్త వచ్చి గుమ్మడిపండులాంటి కొడుకు పుట్టాడని చెప్పినప్పుడు, తన ఆనందానికి పట్టపగ్గాలు లేకపోయాయి. నాలుగు వీశెల మిఠాయి తీసుకొచ్చి అందరికీ పంచిపెట్టాడు.

శాస్త్రుల్ని పిలిచి, కొడుక్కి నామకరణం చేయించాడు. అసలు, ఆ స్వాములారి పేరు పెడ్దామనుకొన్నాడు. కాని ఆయన పేరు ఎవరికీ తెలియదు. చాలా పేర్లు ఆలోచించాడు. చివరికి, తల్లికి కోపం వస్తుందని, తన తండ్రి పేరు పెట్టించేశాడు.

మల్లిగాడు తన బుల్లి బుల్లి చేతులతో ఆడుకొంటుంటే తను పరవశించి పోయేవాడు. పొలం పనుల్లోకి వెళ్ళబుద్ధయ్యేది కాదు. పోటీలు పడి, తనూ, తల్లీ అస్తమానూ వాణ్ణి ఎత్తుకొనేవారు. వాడెప్పుడైనా ఆకలి వేసి ఏడిస్తే తను ముత్యాలు మీద ఎగిరేవాడు. తడబడుతూ అడుగులు వేసిన రోజు సాయంత్రం తను వెండి మువ్వలు తీసుకొచ్చి వాడి కాళ్ళకు కట్టాడు. వాడు నడుస్తూ నడుస్తూ కిందపడితే తను బాధపడేవాడు.

వాడి పుట్టినరోజు తనెంత ఘనంగా చేశాడని! పట్నం పోయి పాతిక రూపాయల బొమ్మలు కొని తీసుకువచ్చాడు. అందర్నీ పిలిచి మిఠాయిలు పంచి పెట్టాడు. ఆ రోజు

దిష్టి తగిలి ఉంటుంది. ఆ తర్వాత రెండు నెలలకి, విరోచనాలు పట్టుకొని దబ్బపండులా ఉండేవాడు చిక్కిపోనారంభించాడు. మందులిప్పించాడు. దేముళ్ళకి మొక్కుకొన్నాడు. అమ్మవారికి కోడిపుంజును తెగవేశాడు. చూస్తూండగానే, తన ఆశాజ్యోతి ఆరిపోయింది. అంచెలంచెలుగా గతంలోంచి ప్రస్తుతానికి దిగజారిన చంద్రయ్య, మరోసారి ఘొల్లుమన్నాడు.

అచేతనంగా కూర్చుండిపోయిన ముత్యాల్ని పట్టుకొని ఓదారుస్తున్నారు చుట్టుపక్కల ఆడవాళ్ళు. వాళ్ల ఓదార్పులేవీ ముత్యాలుకి వినబడటం లేదు. ఎదురుగా గుండె లవిసిపోయేటట్లుగా ఏడుస్తున్న మొగుడు కనబడుతున్నా - ఆలోచనలు వెనక్కు పరుగెడ్తున్నాయి.

చంద్రయ్యకి తనే సర్వస్వం. తాళి కట్టిన రోజు నుంచీ, ఎంత ఆదరంగా చూసుకొన్నాడని! తన కడుపు పండలేదని, అత్త సాధింపులు మనస్సునెంత గాయపర్చినా, ఆ కష్టాన్ని మొగుణ్ణి చూసేసరికి మర్చిపోయేది. మొగుడు తనని విడిచి మారు మనువాడతాడన్న భయంతో గిజగిజ లాడినప్పుడు, తన్నెంతగా ఓదార్చాడని! ఆ రోజు మొగుడి మనస్సు తెలుసుకొన్న తను, ఎంతగా పరవశించిపోయింది! ఆ ఆనందం ఎంతకాలం నిల్చిందని?

తను జీవితంలో మరిచిపోలేని ఆ భయంకరమైన రోజు -

రాముల వారి కోవెలలో స్వాములవారి దర్శనం చేసుకొని, చేల కడ్డంపడి తిరిగి వస్తున్నారు. రామిరెడ్డి, మామిడి చెట్టు కింద పడక్కుర్చీలో కూర్చుని, ధాన్యం బస్తాలు లారీకెత్తిస్తున్నాడు. చంద్రయ్యని చూస్తూనే "సమయానికే వచ్చావు. నీకు కబురంపుదామను కొంటున్నాను. పట్నం పోయి బస్తాల్ని రైసుమిల్లులో అప్పజెప్పి, సొమ్ము తీసుకురా" అని పని పురమాయించాడు.

చంద్రయ్య తన్ను చూస్తూ, "నేను మధ్యాహ్నానికల్లా తిరిగి వచ్చేస్తాను. నువ్వు అన్నం పట్టుకొని రా. చివరి చెక్కలో బోరింగు దింపాలి ఈ రోజు" అని లారీ ఎక్కాడు. కామందుకి తన మొగుడి మీద ఉన్న విశ్వాసానికి సంతోషిస్తూ ఇంటి దారి పట్టింది.

పన్నెండు గంటల వేళ అన్నం గిన్నెలు గంపలో సర్దుకొని, పొలం చేరింది తను. చంద్రయ్య ఇంకా రాలేదు. సేద తీర్చుకొందామని, నేరేడు చెట్టు కింద గడ్డివాములో కూలబడింది. చెమట పట్టిన వంటికి, పడమటి గాలి తగలడంతో ఒళ్లు జలదరించి, మాగన్నుగా రెప్పలు మూసింది ఓ రెండు నిమిషాల పాటు. ఉలిక్కిపడి కళ్ళు తెరిచేసరికి, రామిరెడ్డి కౌగిలిలో నలిగిపోతోంది. అరవాలని ప్రయత్నించింది. ఆ కేక గొంతుకలోనే ఉండిపోయింది. తన్నుకొంది, గింజుకొంది. రామిరెడ్డి కబంధ హస్తాల నుండి తప్పించుకోలేక పోయింది. రామిరెడ్డి మృగతృష్ణకు తను బలైపోయింది.

రామిరెడ్డి విలాసంగా తనకేసి చూస్తూ అన్నాడు- "నా కన్ను చెదరడానికి కారణం, నీ అందం! ఈ విషయం మనిద్దరి మధ్యే ఉండిపోవడం ఇద్దరికీ శ్రేయస్కరం. ఇలాగే

అప్పుడప్పుడూ...''

సాచిపెట్టి రామిరెడ్డిని లెంపకాయ కొట్టి అక్కణ్ణుంచి పరుగెత్తుకు పోయింది. ఇంటికి వెళ్ళేసరికి అత్త పెత్తనాలకి పోయింది. నులక మంచం మీద పడి కంటికీ మంటికీ ఏడ్చింది. చద్దామని ఆలోచించింది. తను లేందే చంద్రయ్య బతకలేడు. అతి కష్టం మీద ఆ ప్రయత్నం నుంచి విరమించుకొంది. రామిరెడ్డి చెప్పినట్టు ఈ భయంకర రహస్యాన్ని తనలోనే దాచేసుకోవాలి. నిజం చెప్తే, జరిగే దారుణ రక్తపాతాన్ని ఊహించుకోగల్గింది. గుండె రాయి చేసుకొంది. ఆ రాత్రి మొగుడు తిరిగి వచ్చేసరికి, తను నవ్వు ముఖంతో ఎలా ఉండగలిగిందో, భగవంతుడికే తెలియాలి.

''ఇంత ఆలస్యం ఎందుకయిం''దని తను అడిగింది.

''ఆ వెధవ లారీ దారిలో పాడైపోయింది. తిరిగివచ్చి డబ్బు రామిరెడ్డిగారికి అందజేసి యిప్పుడే వస్తున్నాను. నువ్వు మధ్యాహ్నం తీసుకొచ్చిన అన్నం వీరిగాడు తినేశాడట! మంచి ఆకలిగా ఉంది,'' అన్నాడు.

'నన్ను కూడా, రామిరెడ్డి తినేశాడు!' తన మనసులో మాట మనసులోనే ఉండి పోయింది.

తను నెల తప్పిన రోజున ఆ యింట్లో జరిగిన సందడి అంతా యింతా కాదు. పండంటి కొడుకుని కన్న రోజున మొగుడి ఆనందానికి హద్దులు లేవు. మల్లిగాడే సర్వస్వమూ అయిపోయిన అత్తనీ, మొగుణ్ణీ చూస్తే తన మనస్సు కలుక్కుమనేది. ''చూడు ముత్యాలూ, కళ్ళు అచ్చు నీ కళ్లలాగే ఉంటా''యని మొగుడన్నప్పుడల్లా 'వాడి ముక్కు రామిరెడ్డి ముక్కులా ఉంటుంద'ని అందామని ఎన్నోసార్లు ప్రయత్నించింది కాని, ఓడిపోయింది. మరొకరు రూపొందించిన మల్లిగాణ్ణి, తను కులదీపకుడిగా చూసుకొనే వాళ్ళిద్దర్నీ చూస్తూ రంపపు కోత ననుభవిస్తోంది! గుండె ధైర్యాన్ని యివ్వమని తను భగవంతుణ్ణి ప్రార్థించని రోజు లేదు!

అయితే ఈ రోజు భగవంతుడు నిజంగా, ఎంతగానో మేలు చేశాడు. తనకి కొడుకే కావచ్చు. కాని తనను కట్టుకున్న మొగుడికి కొడుకు కాని మల్లిగాణ్ణి దేముడు తీసుకుపోయాడు! జీవితాంతం వాడు గుండెల మీద కుంపటిలా ప్రతిక్షణం రామిరెడ్డి దౌర్జన్యాన్ని గుర్తుచేస్తూ ఉండేవాడు! ఇప్పుడా భయం లేదు. బాధ లేదు. మొగుడు మోసపోయాడన్న చింత లేదు!

ముత్యాలు మనసు తేలికైంది. ఒక్క దీర్ఘ నిశ్వాసం విడిచింది. మరుక్షణంలోనే పట్టుకొన్న వాళ్ళని వదిలించుకొని భోరుమని ఏడుస్తూ మల్లిగాడి మీద పడి ఏడవసాగింది!

''కన్న కొడుకు కాలం తీరిపోతే, కన్నీరైనా కార్చని ఆడది!'' అని నలుగురూ ఆడిపోసుకుంటారన్న భయం వల్లనో, ఎంత కాదనుకొన్నా తల్లి మనసు ఉండబట్టలేకనో? -- ముత్యాలుకే తెలియాలి!

('యువ' మాస పత్రిక)